వైభవంగా స్వామివారి తిరు కల్యాణోత్సవం



కల్యాణంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ ఆలయం త్రయోదశ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి తిరు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, చైర్మన్ అంజి పటేల్, బీఆర్‌ఎస్ నేతలు కొత్త చక్రపాణిగౌడ్, జడిగె రమేశ్ యాదవ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, బందారం శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

గౌతంనగర్: న్యూ మిర్జాలగూడ రాజశ్రీనివాస నగర్‌లోని శ్రీసిద్ధి వినాయక స్వామి ఏకవింశతి, శ్రీఅన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం పలు పూజా కార్యక్రమాలు, అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రంగాచార్యులు, సెక్రటరీ డీఎస్.ప్రకాశ్‌రావు, ట్రెజరర్ కె.ప్రసాద్, సభ్యులు నర్సయ్య, టీజే. ప్రకాశ్‌రావు, లవకుమార్, దశరథ రామిరెడ్డి, ఆంజనేయులు, ఏవీ.శ్రీనుబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



జీనియస్ టాట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతి, దశమంత్‌రెడ్డి

అల్వాల్: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఓల్డ్ అల్వాల్ సాయిబాబా ఆలయం వెనుక నూతనంగా ఏర్పాటుచేసిన జీనియస్ టాట్స్ స్కూల్‌ను రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంతరెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రోహిత్‌రెడ్డి, అనురాధారెడ్డి, స్వాతిరెడ్డి, దివ్యరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు అరుణ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ బాటలో నడవాలి



వేడుకల్లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని మల్లా పూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ సింగం చెరువు తండాలో నిర్వహించిన సేవాలాల్ జయంతికి హాజరై సేవాలాల్ గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీరునాయక్, శంకర్‌నాయక్, మహేశ్ నాయక్, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు తండా వాసుగౌడ్, పద్మారెడ్డి, కిషన్, సింగచెరువు తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేత



వాలీబాల్ కిట్ అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజీగూడ యాదాద్రి పార్కు తెలంగాణ క్రీడా ప్రాంగణం వద్ద మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి వాలీబాల్ క్రీడాకారులకు సొంత ఖర్చులతో కిట్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కులో క్రీడా మైదానం, ఓపెన్ జిమ్, యోగాకేంద్రం అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జితేందర్‌నాయక్, ఎట్టల్‌రెడ్డి, హరీశ్‌గౌడ్, జితేందర్, మహేశ్, సింహాద్రి, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సన్నద్ధం!

నోటిఫికేషన్ రావడమే తరువాయి

- రంగంలోకి అధికార యంత్రాంగం
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు
- మేడ్చల్ జిల్లాలో 34 జీపీల్లో ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు



సాక్షి,సిటీబ్యూరో: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. షెడ్యూల్ విడుదలైన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గ్రామాలు, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో సహా రిటర్నింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ సైతం పూర్తి చేశారు. ఇదిలాఉంటే త్వరలో కొత్త సర్పంచ్‌లు వస్తారని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 34 జీపీలు ఉండగా, 66,044 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 33,150 మంది పురుషులు ఉండగా, 32,893 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ముగ్గురు ఉన్నారు. 34 జీపీల పరిధిలో 320 వార్డులు ఉండగా, 320 పోలింగ్ కేంద్రాలను సైతం ఖరారు చేసి ఎన్నికల సామగ్రిని సైతం మండలాల వారీగా పంపిణీ చేస్తున్నామని పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

వ్యూహాలకు పదును..

స్థానిక సమరంలో పార్టీల గుర్తులు లేకపోయినా అభ్యర్థిని బట్టే ప్రజలు ఓటేస్తారు. అయితే కాంగ్రెస్ ఆశావహులు ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్లనుండగా, మరోవైపు బీఆర్‌ఎస్ మద్దతుదారులు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని రెడీగా ఉన్నారు. రిజర్వేషన్లు ఎలా ఉన్నా మాజీ ప్రజాప్రతినిధులు తమ కుటుంబీకులను నిలపాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈసారి పట్టు బిగిస్తే రాబోయే ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.

◆ బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ముగిసి, డేటా ఎంట్రీ కూడా పూర్తయ్యింది. అయితే మళ్లీ రిజర్వేషన్లను కొత్తగా ఖరారు చేయనుండడంతో మార్పులు జరిగే అవకాశం ఉండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ పెరిగింది.

ఎన్నికలకు యంత్రాంగం రెడీ.

ఈసీ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మేడ్చల్ జిల్లాలోని రాజకీయ వర్గాల్లో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాల పరిధిలో 62 జీపీలు ఉండగా, ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంలో భాగంగా 28 పంచాయతీలు సమీపంలోని ఏడు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. దీంతో కీసర, ఘట్‌కేసర్ మండలాలు పూర్తిగా అర్బన్ ప్రాంతాలుగా రూపాంతరం చెందాయి. మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాల పరిధిలోని 34 గ్రామాలు మాత్రమే పంచాయతీలుగా మిగిలిపోయాయి. మేడ్చల్ మండలంలో 14 పంచాయతీల్లో 22,675 మంది ఓటర్లు ఉండగా, 126 వార్డులు ఏర్పాటు చేశారు. మూడుచింతలపల్లి మండలంలో 13 పంచాయతీల్లో 20,910 మంది ఓటర్లు ఉండగా, 122 వార్డులు, శామీర్‌పేట మండలంలో ఏడు పంచాయతీల్లో 22,459 మంది ఓటర్లు ఉండగా, 72 వార్డులు ఏర్పాటు చేశారు. మొత్తంగా 3 మండలాల పరిధిలోని 34 పంచాయతీల్లో 320 వార్డులు ఉండగా వార్డుకొకటి చొప్పున 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఎంపీటీసీ ఎన్నికలకూ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా, ఇందులో 3 మండలాలు మాత్రమే రూరల్ ప్రాంతంగా ఉన్నాయి. వీటి పరిధిలోని 19 ఎంపీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మేడ్చల్ మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 48 పోలింగ్ కేంద్రాలు , శామీర్‌పేట మండలంలో 6 స్థానాలకు 45, ఎంసీపల్లి మండలంలో 6 స్థానాలకు 45 పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసింది.

మేడ్చల్ జిల్లాలో ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు

మేడ్చల్ జిల్లాలో రూరల్ ప్రాంతంగా మిగిలిన 3 మండలాల పరిధిలో 34 జీపీలు ఉన్నాయి. అయితే వీటిని కూడా ప్రభుత్వం 3 లేదా 4 మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయనున్నదనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అసలు స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయా..? లేదా అని సందేహాలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సర్కారు జిల్లాలోని 34 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తే మాత్రం స్థానిక ఎన్నికలు లేనట్టేనని చెప్పొచ్చు. అదిగాకుండా పంచాయతీలుగానే కొనసాగించాలని భావిస్తే మాత్రం ఎన్నికలు ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

పీర్జాదిగూడలో కులగణన రీ సర్వే ప్రారంభం



పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపాలిటీలో ఆదివారం కుల గణన సర్వే ప్రారంభమైనట్లు కమిషనర్ త్రిలేశ్వర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రీ సర్వే కోసం టోల్ ఫ్రీ నంబర్ 040–21111111 తో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈనెల 28 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాల్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు కులగణనలో పేర్లు నమోదు చేసుకోని కుటుంబ సభ్యులు మాత్రమే ఫోన్ చేసి పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కాల్ సెంటర్ ద్వారానే కాకుండా..ఈసారి ఆన్‌లైన్‌లోనూ, నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసేవా కేంద్రాల్లోనూ ఎంటర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే ఎన్యూమరేటర్లను ఇంటికే పంపిస్తామని కమిషనర్ తెలిపారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో డ్రంకెన్ డ్రైవ్

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లో ఆదివారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్‌ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ ఆధ్వర్యంలో మలక్‌పేట ఇన్‌చార్జి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహానాయక్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టగా 10 మంది ద్విచక్ర వాహనాదారులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీలో ట్రాఫిక్ ఎస్సై రాము, ఎస్సై కిరణ్‌లాల్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో అలరించిన కార్యక్రమాలు



ఉప్పల్: వారాంతపు సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రమణి సిద్ధి ఆధ్వర్యంలో నిర్వహించే నెల నెల కళారాధనలో భాగంగా త్యాగరాజ పంచరత్న కీర్తనలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నూతి ప్రసూన, రమణి సిద్ధి శ్రీ బాలాజీ కుమార్, రాజేశ్వరి, విశాఖ ప్రకాశ్, మాధవి శర్మ శిష్య బృందం త్యాగ రాజ కృతులు, దుడుకు గల నన్నే దొర, ఎందరో మహానుభావులు, గణేషా పంచరత్న, జగదానంద కారక, తదితర అంశాల్లో కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకే ఎగ్జిబిషన్



పరిశీలిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్

మల్లాపూర్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఎగ్జిబిషన్లు ఉపయోగపడుతాయని డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన నాచారం జ్ఞాన్ ప్రియస్టా 2025 ఎగ్జిబిషన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో గణితం, ఇంగ్లిష్, సోషల్ సైన్స్, ఐసీటీ, ఆర్ట్స్, క్రాఫ్ట్, స్కూల్ లైబ్రరీ, ఫైనాన్సియల్ లిటరసీ, స్కూల్ సినిమా, సాఫ్ట్ స్కిల్స్, డ్యాన్స్, మ్యూజిక్ వంటివి ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కమలా మనోహర్‌రావు, ప్రిన్సిపాల్ సుమా మీనన్, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల అదృశ్యం



శీతల్



అలేఖ్య



ఆదిత్య

మల్కాజిగిరి: తల్లీ ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. ఉమేశ్‌కుమార్ శర్మ తన భార్య శీతల్ (36) కూతురు అలేఖ్య(11), కుమారుడు ఆదిత్య (9)తో కలిసి మల్లికార్జుననగర్‌లో నివాసముంటున్నాడు. ఈనెల 11న శీతల్ పిల్లలను తీసుకుని స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పింది. అదేరోజు ఉమేశ్‌కుమార్ తన స్వస్థలం ఒడిస్సాకు వెళ్లి అక్కడినుంచి తల్లితో కలిసి మహాకుంభమేళాకు వెళ్లి ఈనెల 15 న తిరిగి వచ్చాడు. భార్య పిల్లలు లేకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారు పలుప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి..



కావల శ్యామ్

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దీనదయాల్‌నగర్‌లో నివసించే కావల శ్యామ్ (42)కి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో మద్యం తాగి రాగా భార్య అనురాధా మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన శ్యామ్ ఫోన్ ఇంట్లోనే పెట్టి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: వివేకానంద ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మణికంఠనగర్, వివేకానందనగర్, శ్రీలక్ష్మీనారాయణ, లెక్చరర్స్‌కాలనీ, ఎస్‌ఐఎన్ కాలనీ, ఐఐసిటీ కాలనీ, భీంరెడ్డినగర్, గ్రీన్‌సిటీ కాలనీ, అన్నపూర్ణ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనగర్, సరస్వతినగర్, విజయపురి కాలనీ, శ్రీలక్ష్మీనగర్, ఉదయ్‌నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ ధరణి ఫీడర్ పరిధిలో..

మేడిపల్లి: 11కేవీ ధరణి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే పీఅండ్‌టీకాలనీ, శ్రీనివాసనగర్, సాయి హిల్స్ కాలనీ, వినాయకనగర్, సంపూర్ణ హోటల్ మేన్ రోడ్డు, సాయిరాం నగర్ కాలనీ, క్రాంతి కాలనీ, గ్రీన్‌ల్యాండ్స్ కాలనీ, పంచవటి కాలనీ రోడ్డు నంబర్ 1,2,3, విహారిక కాలనీ రోడ్డు నంబర్–1,2,3,4,5, కాకతీయనగర్ కాలనీ, ధరణి కాలనీల్లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆర్ఎన్ఎస్ ఫీడర్ పరిధిలో ..

బోడుప్పల్: సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల కారణంగా ఆర్ఎన్ఎస్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఎస్ కాలనీ, రాయల్ మెడోస్, డ్రీమ్ హోమ్స్, అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీ, పద్మావతి కాలనీలు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, గౌతమీనగర్, రాజీవ్‌నగర్, జ్యోతి నగర్, వీరారెడ్డినగర్, ఇందిరానగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గుండెపోటుతో క్రికెట్ కోచ్ మృతి

కీసర: పూణె క్రికెట్ జట్టు కోచ్ మహారాష్ట్రకు చెందిన ఎ. తిరువెంకటచారి(60) గుండెపోటుతో మృతి చెందాడు. నగరంలోని రాంపల్లి సమీపంలో గల క్రీడా మైదానంలో శనివారం జరిగిన క్రికెట్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఒక్కసారిగా గుండెనొప్పితో కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు.

గ్రీన్ ఫీల్డ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్

అల్వాల్: కానాజీగూడలోని గ్రీన్ ఫీల్డ్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధ్యక్ష స్థానానికి ఒక్కరే మిగలడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు. కాగా ఉపాధ్యక్షులకు ముగ్గురు ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఇద్దరి చొప్పున పోటీలో ఉన్నారు. కార్యవర్గ సభ్యులకు ఏడుగురు ఉన్నారు. ఈనెల 23న ఈ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 694 మంది సభ్యులు ఉన్న గ్రీన్‌ఫీల్డ్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక చాలాకాలం నుంచి పెండింగ్ ఉండగా కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీనివలన దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికయ్యే కమిటీ పరిష్కారం చూపుతారని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు కమ్యూనిటీ సెంటర్ మంజూరు



సెంటర్ మంజూరు పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ రజిత, పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్: ఉప్పల్‌లో తోపుడు బండ్ల వ్యాపారులకు కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డితో కలిసి కమ్యూనిటీ సెంటర్ నిర్మాణ మంజూరు పత్రాలను తోపుడు బండ్ల వ్యాపారులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉప్పల్‌లో 400 గజాల స్థలంతో పాటు నిర్మాణానికి కావాల్సిన రూ. కోటి 15 లక్షల నిధులను కూడా మంజూరైనట్లు తెలిపారు. దీంతో తోపుడు బండ్ల వ్యాపారులు నాగూర్ భాషా, ఖాజా తదితరులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాకారం లక్ష్మణ్, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, అల్లా భాషా, ఫీరంభీ, సిద్ధాయ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలి



మంత్రి దామోదరకు వినతి పత్రం అందజేస్తున్న రాకేశ్

మల్లాపూర్: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 3 వేల ఆశా వర్కర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్, రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ రాకేశ్ కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు ఆమోదించగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలుచేస్తామని ప్రకటించడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కలిసిన వారిలో దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ ఈసీఐఎల్ ఇన్‌చార్జి ఇప్పల కుమార్, ఉప్పల్ ఇన్‌చార్జి మాజీద్, పులి శ్రీకాంత్, క్రాంతికుమార్, తదితరులు ఉన్నారు.

మోడల్ మార్కెట్లకు మోక్షమెప్పుడో..?

ఉప్పల్ సర్కిల్ పరిధిలో రూ.2 కోట్లతో 3 చోట్ల నిర్మాణం

వసతుల్లేక వచ్చేందుకు జంకుతున్న వైనం

ఏళ్లుగా నిరుపయోగంగానే ఉంటున్న భవనాలు



ఉప్పల్ గాంధీనగర్‌లోని మోడల్ మార్కెట్

ఉప్పల్: వారంతపు సంతల్లో కూరగాయలు విక్రయించే వారికోసం గత ప్రభుత్వం నిర్మించిన మోడల్ మార్కెట్లకు మోక్షం కలగడ లేదు. అందులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఏళ్లుగా నిరూపయోగంగానే ఉంటున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకుని వాటిని వినియోగంలోకి తీసుకువస్తే అటు వ్యాపారులతో పాటు వినియోగదారులకు సైతం ఎంతో మేలు జరగనున్నది.

దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో రామంతాపూర్ వెంకటరెడ్డినగర్, ఉప్పల్ బీరప్పగడ్డ, ఉప్పల్ గాంధీనగర్‌లో 3 మోడల్ మార్కెట్లను నిర్మించారు. రిజర్వేషన్ల వారీగా వేలం వేసి లబ్ధిదారులకు కేటాయించారు. తీరా అందులోకి వెళ్లి చూస్తే కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల లాంటి కనీస వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మీరే సమకూర్చుకోవాలంటూ చెప్పడంతో ఎవరూ కూడా అక్యూపై చేసుకునేందుకు ముందుకు రాలేదు. దీంతో రెండేళ్ల తర్వాత మరోసారి వేలం వేసినా అదే పరిస్థితి. దీంతో అధికారులు ఏమీ చేయాలో తోచక అలానే వదిలేశారు. అప్పటి నుంచి దాదాపుగా తొమ్మిదేళ్లుగా మోడ్రన్ మార్కెట్లు నిరూపయోగంగానే ఉంటున్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం తాగడం, గంజాయి సేవిస్తున్నారు. దీంతో అవి ఉపయోగపడక పోగా కొత్త సమస్యను తెచ్చిపెట్టాయి.



ఉప్పల్ బీరప్పగడ్డలోని మోడల్ మార్కెట్

2016 లో ప్రారంభం..

2016 డిసెంబర్‌లో అప్పటి మేయర్ బొంతు రామ్మోహన్ ఈ మార్కెట్లను ప్రారంభించారు. 3 మార్కెట్లలో కలిపి 49 షాపులు ఉండగా అందులో కేవలం 2 మాత్రమే అక్యూపై అయ్యాయి. అయితే వారు కూడా అద్దె చెల్లించడం లేదు.

◆ వెంకటరెడ్డినగర్ నిర్మించిన 15 షాపులకు గాను అన్ని అలాగే ఉన్నాయి. వేలంలో దక్కించుకున్నా వారు వసతులు లేక అలానే వదిలేశారు.

◆ ఉప్పల్ గాంధీనగర్ కూరగాయల మార్కెట్‌లో రూ. 70 లక్షలు వెచ్చించి నిర్మించిన మోడల్ మార్కెట్లలో గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో కలిపి 15 షాపులు నిర్మించారు. వాటిల్లోనూ వసతుల్లేక ఎవరూ ముందుకు రావడం లేదు.

◆ ఉప్పల్ మండే మార్కెట్ బీరప్పగడ్డలో రూ. 50 లక్షల వ్యయంతో మోడల్ మార్కెట్ నిర్మించారు. అందులో 19 షాపులు ఉన్నాయి. వేలంలో దాదాపు షాపులను దక్కించుకున్నా ఇప్పటికీ రెండు మాత్రమే అక్యూపై అయ్యాయి.

వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకువస్తాం

మోడల్ మార్కెట్ల నిర్వహణ, వేలం, లబ్ధిదారులకు అందించడం లాంటివి ఎస్టేట్ అధికారులు చూసుకుంటారు. అయితే త్వరలోనే మోడల్ మార్కెట్లలో వసతుల కల్పించి అందుబాటులోకి తీసుకువస్తాం. అప్పటి వరకు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు